క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: నేడు కానూరు మురళీనగర్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా మురళీనగర్, గౌరీశంకర్‌నగర్, జేఆర్‌డీటాటా ఎస్టేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు.

రామవరప్పాడు: విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పరమేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని పోరంకి రోడ్డు, సొసైటీ బజారు, డాల్ఫిన్ అపార్టుమెంట్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీరామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు పర్యవేక్షించారు.

సర్పంచ్, కార్యదర్శి ఫిర్యాదులపై కేసు నమోదు

ఉంగుటూరు: పంచాయతీ సర్పంచ్, గ్రేడ్-5 కార్యదర్శి పరస్పర ఫిర్యాదులపై ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గన్నవరం మండలం తెంపల్లి గ్రామ సచివాలయ గ్రేడ్-5 కార్యదర్శి సింహాద్రి హర్షవర్ధిని విధులు సక్రమంగా నిర్వహించడంలేదని గ్రామ సర్పంచ్ కొలుసు శిరీష కార్యదర్శిని సచివాలయంలో అడిగారు. దీంతో ఇరువురి మధ్య వాదోపవాదనలు తారాస్థాయికి చేరాయి. దీంతో సాయంత్రం గ్రేడ్-5 కార్యదర్శి హర్షవర్ధిని ఆమె భర్త చిదంబరం సర్పంచ్ శిరీషపై దాడి చేశారని సర్పంచ్ ఆత్కూరు పోలీసులను ఆశ్రయించింది. ఇదే విషయమై కార్యదర్శి కూడా తమపై సర్పంచ్ దాడికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు ఆత్కూరు ఎస్ఐ పైడి బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బస్సు డ్రైవర్‌పై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేయడంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం ఉయ్యూరుకు చెందిన గుర్రం శ్రీనివాసరావు ఆర్టీసీ విద్యాధరపురం డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా ఆదివారం అతను విజయవాడ నుంచి పామర్రుకు బయలుదేరాడు. బస్సు తాడిగడప జంక్షన్ వద్ద సిగ్నల్ పడటంతో ఆపాడు. ఆ తర్వాత బస్సు బయలుదేరగా పక్క నుంచి వెళ్లిన కారు బస్సుకు తగిలింది. దీంతో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు కారును బస్సుకు అడ్డంగా ఆపి డ్రైవర్‌పై దాడి చేశారు. ఈ దాడిలో బస్సు డ్రైవర్‌కు గాయాలు అవ్వడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేశారు. దాడి చేసిన ఇద్దరు వ్యక్తులు పెనమలూరుకు చెందిన వారని వారిపై చర్యలు తీసుకోవాలని బస్సు డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

పెదపులిపాకలో అమ్మవారికి ఆషాఢ సారె



పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ విజయ రాజరాజేశ్వరి శ్రీ విజయ సుందరేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ తదితర పూజా సామగ్రిని అమ్మవారికి సమర్పించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 'శుభదిన్ భోజన్'

- నూతన విద్యా విధానం ప్రారంభమై నాలుగేళ్లు పూర్తి
- విద్యార్థులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ



ఈడుపుగల్లులో విద్యార్థులకు పండ్లు, మిఠాయి పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ దేవినేని రాజా

గన్నవరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శుభదిన్ భోజన్ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కేసరపల్లి శివారు సుందరయ్యనగర్ ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు దాత పి.లక్ష్మి సహకారంతో పౌష్టికాహారం అందించారు. విద్యార్థులతో కలిసి ఎంఈఓ-1 కొండా రవికుమార్, ఎంఈఓ-2 కమల, హెచ్ఎం, ఉపాధ్యాయులు భోజనం చేశారు. దావాజిగూడెంలోని ఎంపీపీ పాఠశాల(మోడల్ ఫౌండేషన్ స్కూల్)లో తులిఫ్ గార్డెన్ సౌజన్యంతో విద్యార్థులకు పండ్లు, ఆహారం అందించారు. మండలంలోని 55 ప్రభుత్వ పాఠశాలల్లో శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా దాతల సహకారంతో విద్యార్థులకు వివిధ రకాల ఆహారం అందజేసినట్లు ఎంఈఓ-1 రవికుమార్ తెలిపారు.

తాడిగడప పాఠశాలలో

పెనమలూరు: జాతీయ విద్యా విధానం అమలు నేపథ్యంలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా సోమవారం తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుభదిన్ భోజన్ నిర్వహించారు. పాఠశాలలో తెలుగు విభాగం ఉపాధ్యాయిని మాగంటి అనిత కుమారుడు ప్రణీత్ దాతృత్వంతో పాఠశాలలో 550 మంది విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంతోపాటు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తాడిగడప పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

కంకిపాడు: క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా కోరారు. నూతన విద్యా విధానం ప్రారంభమై నాలుగేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని తన తండ్రి దేవినేని గంగాధర్‌రావు జ్ఞాపకార్థం ఈడుపుగల్లు ఎంపీపీ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ చేయూతతో పాటు, దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని చెప్పారు. క్రమశిక్షణ అలవర్చుకుని, సామాజిక బాధ్యతతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.ఇందిర, ఉపాధ్యాయులు రూపవాణి, మండవ శ్రీనివాస్, మీనా కుమారి, స్థానికులు పి.సుధాకర్, కాకుళ్ల సుధాకర్, గరికపాటి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్యనగర్ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓలు

620 మంది విద్యార్థులకు పౌష్టికాహారం

గన్నవరం రూరల్: మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ శుభదిన్ భోజన్ కార్యక్రమం జరిగింది. 620 మంది విద్యార్థులకు పాఠశాలలో ఇచ్చే మెనూ భోజనంతో పాటు అదనంగా ఆహార పదార్థాలు తయారు చేసి అందించారు. ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం, వారిలో కలుపుగోలు స్వభావాన్ని పెంపొందించడమే లక్ష్యమన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ భాగస్వామ్యంతో గారెలు, పూర్ణాలు, స్వీట్లు, చపాతీ, బూందీ, యాపిల్స్ వంటి పోషక విలువలున్న ఆహారం వడ్డించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలు జెడ్పీ హైస్కూళ్లలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం శుభదిన్ భోజన్ ఏర్పాటు చేశారు. బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో ఎంఈఓ శ్రీరామ్ బాలాసింగ్ పాల్గొని విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. దాతల సాయంతో మధ్యాహ్న భోజనంతోపాటు స్వీట్లు, అరటి పండ్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. రేమల్లె జెడ్పీ హైస్కూల్‌లో గ్రామ ప్రముఖుడు యనమదల సుధాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తోట వెంకట నాగేశ్వరరావు, ఎస్.లూథర్‌పాల్ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి పంక్తి భోజనం చేస్తున్న ప్రిన్సిపాల్ యశోదలక్ష్మి

జాతీయ రహదారిపై విద్యుత్ వెలుగులు

కంకిపాడు: జాతీయ రహదారిపై విద్యుత్ వెలుగులు ప్రసరిస్తున్నాయి. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి మార్గంలో కంకిపాడు మండల పరిధిలోని పలు చోట్ల రోడ్డు క్రాసింగ్‌లు ఉన్నాయి. గోసాల సెంటరు, కంకిపాడు బైపాస్ మార్గం, దావులూరు టోల్‌గేట్, నెప్పల్లి-చలివేంద్రపాలెం ప్రధాన సెంటర్లలో రాత్రయితే చాలు ఏ వైపు నుంచి ఏ వాహనం వెళ్తుందో అర్థం కాని పరిస్థితి. తరచూ వాహనాలు ప్రమాదాల బారిన పడేవి. సమస్యను గుర్తించిన జాతీయ రహదారుల శాఖ చర్యలు తీసుకుంది. ఆయా ప్రదేశాల్లో భారీ విద్యుత్ స్తంభాలను అమర్చి వాటికి విద్యుత్ దీపాలను ఏర్పాటుచేశారు. దీంతో రాత్రివేళల్లో ప్రధాన కూడళ్ల వద్ద రాకపోకలు సజావుగా సాగిపోతున్నాయి. దీంతోపాటు వాహనాల వేగాన్ని నియంత్రించేలా, రోడ్డు క్రాసింగ్ హెచ్చరిస్తూ సిగ్నల్ లైట్లను సైతం ఏర్పాటుచేశారు.



గోసాల ప్రధాన సెంటరులో జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన విద్యుత్ లైట్లు

నున్నలో చేపల చెరువుల వేలం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ పరిధిలోని పుల్లయ్యచెరువు, ఎర్రచెరువుల్లో 2024-25 నుంచి 2026-27 వరకు చేపలను పట్టుకునేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి జిటివి. రమణ సోమవారం వేలం పాటను నిర్వహించారు. పుల్లయ్య చెరువును మూడు లక్షల 24వేల రూపాయలకు ఆవల కోటయ్య వేలం పాడగా, ఎర్ర చెరువును రెండు లక్షల 26వేల రూపాయలకు పలగాని యేసుబాబు వేలం పాట పాడారు. వేలం మొత్తాన్ని చెల్లించేలా షరతులకు లోబడి నిర్వహించారు. బహిరంగ వేలంలో గ్రామస్తులు యర్కారెడ్డి నాగిరెడ్డి, యర్కారెడ్డి కోటిరెడ్డి, మాదు శివరామ ప్రసాద్, దేవులపల్లి సతీష్, గుంటక సుబ్బారెడ్డి, మురళీ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రభుత్వ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెలమర్తి రవిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం పలువురు మండలస్థాయి అధికారులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. జీవో నంబర్ 117ను రద్దు చేయాలని, జీవో ఎంఎస్ నంబర్ 53 ప్రకారం ఉపాధ్యాయుల కేటాయింపు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల నిర్వహణ, హైస్కూళ్లల్లో ద్విభాషా బోధన, బోధనేతర సిబ్బంది నియామకం, ప్లస్ టూ పాఠశాలల్లో పీజీటీ పోస్టులకు ప్రమోషన్లు వంటి పెండింగ్ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఎంఈఓ, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. యూటీఎఫ్ మండల అధ్యక్షురాలు పి.జగతి, ప్రధాన కార్యదర్శి కె.శ్రీహరి, మండల గౌరవాధ్యక్షుడు ఎస్.గంగాధర్ పాల్గొన్నారు.



ఎంఈఓ శ్రీరామ్ బాలాసింగ్‌కు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఓఆర్ఎస్‌పై అవగాహన



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ ఓఆర్ఎస్ దినోత్సవం పురస్కరించుకుని విజయవాడ డివిజనల్ రైల్వే హాస్పిటల్‌లోని న్యూ ఓపీడీ భవనంలో ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి సీఎంఎస్ డాక్టర్ శౌరి బాల పిల్లల సంరక్షణలో ఓఆర్ఎస్ వినియోగంపై మార్గదర్శకాలను వివరించారు. ముఖ్యంగా పిల్లల్లో డయేరియా, డీహైడ్రేషన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానాన్ని తెలిపారు. ఏసీఎంఎస్ డాక్టర్ జైదీప్ డయేరియా, అతిసారం తదితర సంబంధిత పరిస్థితులు, చికిత్స విధానం, ఓఆర్ఎస్ తయారీ, వినియోగం తదితర విషయాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్లుప్తంగా వివరించారు. అనంతరం మహిళలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పటల్ సిబ్బంది, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

గన్నవరం రూరల్: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులను దూరం చేసుకోవాలని మండల వైద్యాధికారి శ్రీహర్ష సూచించారు. సూరంపల్లి-1లో సోమవారం గ్రామస్తులకు 104 వాహన వైద్య సేవలు అందించారు. దీర్ఘకాల రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తూ క్రమం తప్పకుండా వాడాలని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఇళ్లల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ఆ నిల్వలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది స్వరూప, ప్రవీణ్, లక్ష్మి పాల్గొన్నారు.



సూరంపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అంతరిక్ష రంగంలో భారత్ అపూర్వ ప్రగతి

పటమట(విజయవాడపశ్చిమ): అంతరిక్ష పరిశోధనా రంగంలో భారతదేశం అపూర్వమైన ప్రగతిని సాధించిందని షార్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ డైరెక్టర్ డాక్టర్ గోపీకృష్ణ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'భారత అంతరిక్ష ప్రయాణం' అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ భారతదేశం అంతరిక్ష పరిశోధనా రంగంలో దూసుకువెళ్లడంతో శాస్త్రీయ పురోగతికి, దేశ ఆర్థిక సామాజిక ప్రగతికి అండగా నిలిచిందన్నారు. 1969 ఇస్రో స్థాపనతో భారత అంతరిక్ష యాత్రకు పునాది పడిందన్నారు. 1975లో మొదటి ఉపగ్రహం ఆర్యభట్టను పంపారన్నారు. టెలికమ్యూనికేషన్స్, బ్రాడ్ కాస్టింగ్, పర్యావరణ, వైద్యారోగ్యం అనేక అంశాల్లో భారతీయ అంతరిక్ష పరిశోధనలు అండగా నిలుస్తున్నాయన్నారు. మానవ సహిత అంతరిక్ష యాత్ర, చంద్రయాన్-3 వంటి పలు అంశాలపై ఆయన ఉత్తేజపూర్వక ప్రసంగం చేశారు. విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ, విభాగాధిపతి ఆర్.ఉదయ్‌కుమార్, అధ్యాపకులు ఏహెచ్‌డీ ప్రకాష్, మౌనిక, శృతి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా డ్రెయిన్లలో పూడికతీత

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని పలు ప్రాంతాల్లో సోమవారం సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లు గుర్తించి పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య సిబ్బందిచే పూడిక తీయించారు. గ్రామంలోని శివాలయం పల్లాలు, ఎస్సీ కాలనీ, కాల్వగట్టు ప్రాంతం, కేవీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రెయిన్లు పూడికతీసి, అంతర్గత రహదారుల్లోని చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లోని చెత్తను తొలగిస్తున్నట్లు చెప్పారు. రామయ్య చెరువు సమీపంలోని ఆ ప్రాంత నివాసితులు చెత్త డంపింగ్ చేయకుండా పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రాంతంలోని చెత్తనంతటిని తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలించామన్నారు. పారిశుద్ధ్యంపై ఏమైనా సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఇంటర్ విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ సాంబశివరావు

ఉంగుటూరు: ప్రభుత్వ తోడ్పాటును విద్యార్థులు సద్వినియోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంఈఓ-2 సాంబశివరావు అన్నారు. తేలప్రోలు జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులకు నోటు పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరాస్యత ఎక్కువగా ఉన్న ప్రాంతాలే అన్ని రంగాల్లో ముందంజలో ఉంటున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ లక్ష్యంతో చదివి ఉన్నత స్థానాల్లో ఉంటే తమ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం దిబోర, హెచ్ఎం ఆదిలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకట కృష్ణారెడ్డి, సీఆర్పీ ఇందిర పాల్గొన్నారు.

అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు దంపతులు

గన్నవరం: గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సదుపాయలను అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత నెలకొందని గుంటూరు జీజీహెచ్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ బీ కృపాలిన్ పేర్కొన్నారు. స్థానిక కంభంపాటి కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఈఎన్‌టీ ఆస్పత్రిని సోమవారం జీవీఎం ఛానల్ ఎండీ చల్లపల్లి శ్రీనివాసరావు, జయశ్రీ దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కృపాకర్ మాట్లాడుతూ.. చెవి, ముక్కు, గొంతు వైద్య విభాగాల్లో 40 ఏళ్ల అనుభవంతో పోరంకిలో అమృత హెల్త్‌కేర్ హాస్పిటల్ ద్వారా ప్రజలకు వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఈఎన్‌టీ వైద్య సేవలను ఈ ప్రాంత ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఇక్కడ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

గ్రామీణ విత్తనోత్పత్తిపై రైతులకు శిక్షణ



రైతు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓలు శైలజ, పద్మజ

పెనమలూరు: రైతులు సాగు మెళకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మచిలీపట్నం జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కె.శ్రీనివాసరావు అన్నారు. పెదపులిపాక గ్రామంలో సోమవారం గ్రామీణ విత్తనోత్పత్తిపై రైతుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు కలుపు మందు వాడే సమయంలో రెండు, మూడు రకాల మందులు కలిపి వాడరాదన్నారు. పంట కొద్దిగా ఎదిగిన తర్వాతే కలుపు మందు వాడాలని సూచించారు. సామూహిక ఎలుకల నివారణ వల్ల ప్రయోజనం ఉటుందని వివరించారు. మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు చేయాలన్నారు. ఎకరాకు 10 కిలోల యూరియా, 5 కిలోల పొటాష్ వాడాలని సూచించారు. ఎరువులు కూడా అవసరాల మేరకే వాడాలని, వ్యవసాయ శాఖ నుంచి రైతులు సలహాలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వారు పంట పొలాలు సందర్శించారు. కార్యక్రమంలో ఏఓ బి.పద్మజ, వీఏఏ ఎండీ.షరీఫ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి

ఉయ్యూరు: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సంక్షేమ పాలన సాగిస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలో పలు వార్డుల్లో రూ. 71 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన, చేపట్టనున్న ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి నిధులు కేటాయించి వేగవంతంగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి సరఫరాకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, మాజీ చైర్మన్‌లు జంపాన పూలా, అబ్దుల్ ఖుద్దూస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు జంపాన గుర్నాథం, ఆయా వార్డు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



ఉయ్యూరు పట్టణంలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఎమ్మెల్యేను సన్మానించిన జనసేన నేతలు

పెనమలూరు: తాడిగడప జనసేన కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను జనసేన నేతలు సన్మానించారు. మున్సిపాలిటీ జనసేన అధ్యక్షుడు తాతపూడి గణేష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కారానికి అందరు సమన్వయంతో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ముప్పా రాజా, అన్నపురెడ్డి వెంకటస్వామి, పలువురు నేతలు పాల్గొన్నారు.

'మానవత' కోటేశ్వరరావు దంపతులు శరీరదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: మరణానంతరం శరీరాన్ని వైద్య విద్య కోసం దానం చేయడం ఎంతో అభినందనీయని ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్, ఎనాటమీ విభాగాధిపతి డాక్టర్ శ్యామల అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కేంద్ర కమిటీ చైర్మన్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు దంపతులు మరణానంతరం శరీర దానం చేశారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మారుబోయిన కోటేశ్వరరావు, సూర్య నాగమణి దంపతులు ఈ మేరకు అంగీకార పత్రాలను డాక్టర్ శ్యామలకు అందజేశారు. శరీర దానం చేసిన కోటేశ్వరరావు, సూర్య నాగమణిలను డాక్టర్ శ్యామలతో పాటుగా పలువురు మానవత సభ్యులు అభినందించారు. శరీరదానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు మానవత చేస్తున్న కృషిని ఆమె కొనియాడారు. శరీరదానంలో పలువురికి ఆదర్శంగా నిలిచేందుకు కోటేశ్వరరావు దంపతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని తెలిపారు. మానవత సీనియర్ సభ్యుడు ఆలపాటి రామచంద్రరావు, హనుమాన్ జంక్షన్ శాఖ అధ్యక్షుడు గూడపాటి జయరామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



అంగీకార పత్రాలను డాక్టర్ శ్యామలకు అందిస్తున్న కోటేశ్వరరావు దంపతులు

అడిగోపుల మృతి సాహితీ ప్రపంచానికి తీరనిలోటు

విజయవాడ కల్చరల్: సాహితీవేత్త, పరిశోధకుడు అడిగోపుల వెంకటరత్నం మృతి సాహితీ ప్రపంచానికి తీరనిలోటని ఏపీ రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ భవానీదేవి అన్నారు. రచయితల సంఘం ఆధ్వర్యాన గాంధీనగర్‌లో అడిగోపుల వెంకటరత్నం సంస్మరణ సభను నిర్వహించారు. భవానీదేవి మాట్లాడుతూ తన కవిత్వం ద్వారా అడిగోపుల యువకవులను ప్రోత్సహించినట్లు తెలిపారు. రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ మాట్లాడుతూ 1984లో సూర్యోదయం కవితా ప్రస్థానం ప్రారంభమైందని ఆయన జీవితాంతం సాహితీ వికాసానికి కృషి చేశారని ఏపీ రచయితల సంఘం గౌరవ సలహాదారునిగా విశేషమైన సేవలను అందించారన్నారు. 27 కవితా సంపుటులు వెలువరించినట్లు తెలిపారు. సభలో ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు, విప్లవ రచయితల సంఘం అధ్యక్షుడు అరవల్లి కృష్ణ సాహితీ సంస్థల ప్రతినిధులు చలసాని అజయ్‌కుమార్, ఓరా ప్రసాద్ అడిగోపల వెంకటరత్నం సాహితీ సేవలను వివరించారు. సీనియర్ జర్నలిస్ట్ సీహెచ్‌వీఎస్ఎస్ శర్మ, బోడి ఆంజనేయరాజు, విద్యావేత్తలు గుమ్మా సాంబశివరావు, పుష్పాదేవి, అనిల్ డ్యాని, నన్నపనేని నాగేశ్వరరావు అడిగోపులతో అనుబంధం గుర్తు చేసుకున్నారు.



మాట్లాడుతున్న భవానీదేవి, వేదికపై డాక్టర్ జీవీ పూర్ణచందు, అరసవిల్లి కృష్ణ